# అసోమ్‌లో పౌరసత్వాన్ని మతతత్వీకరిస్తున్న పాలకుల విధానాలను వ్యతిరేకించాలి

**దశాబ్దాల** క్రితమే అసోమ్‌కు వలసవచ్చిన ఒక విభాగం ప్రజలకు 'విదేశీయులు' అనే ముద్ర తగిలించి, ఆ విభాగం ప్రజలను వేధింపులకు గురిచేయటం పాలకవర్గ పార్టీల చేతుల్లో అనువైన సాధనంగా వుంటోంది.

1951లో అసోమ్‌లో తొలిసారిగా పౌరులను జాతీయ రిజిస్టర్‌లో నమోదు చేశారు. 1955లో పౌరసత్వ చట్టం చేశారు. అయితే పౌరసత్వపు జాబితాను చాలాకాలంపాటు తాజాపరచలేదు. వివిధ కాలాలలో పశ్చిమబెంగాల్‌నుండి రైతాంగ ప్రజానీకం, టీతోటల కార్మికులు తగిన సంఖ్యలో అసోమ్‌కు వలసవచ్చారు. వారిలో అనేకమంది అసోమ్‌ను తమ శాశ్వత నివాసస్థానంగా చేసు కున్నారు. 1971 నాటి యుద్ధం సందర్భంగా, ప్రస్తుత బంగ్లాదేశ్ సరిహద్దు గ్రామాలనుండి అనేకమంది ప్రజలు అసోమ్‌కు వలసవచ్చారు. వారికోసం భారత ప్రభుత్వం అసోమ్ తలుపులను తెరచింది కూడా.

1979లో 'ఆల్ అస్సామ్ స్టూడెంట్స్ యూనియన్' (ఏఏఎస్‌యు–ఆసు), అస్సాం గణ సంగ్రామ పరిషత్(ఏజిఎస్‌పి) స్థానికుల గుర్తింపు సమస్యను లేవనెత్తి, అసోమ్ నుండి విదేశీయు లను పంపివేయాలని డిమాండ్ చేశాయి. పశ్చిమబెంగాల్‌నుండి వచ్చిన ప్రజలను సైతం విదేశీయులుగా పరిగణించే పోకడలు అప్పుడు వ్యక్తమయ్యాయి. ఈ ఉద్యమం హింసాత్మక రూపం తీసుకొని, ఆరు సం॥ల కాలంపాటు సాగింది. చివరకు, రాజీవ్‌గాంధీ నాయకత్వం లోని కేంద్రప్రభుత్వం మరియు 'ఆసు', ఏజిఎస్‌పిల నడుమ 1985 ఆగస్టు 15న అస్సామ్ శాంతి ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఈ ఒప్పందం ప్రకారం 1971 మార్చి 24 అర్ధరాత్రి తర్వాత అస్సాముకు వలస వచ్చిన వారంతా 'విదేశీయులు'గా పరిగణింప బడతారు. రాష్ట్రప్రభుత్వం ఈ కాలపరిధి దాటి అస్సామ్‌లోకి ప్రవేశించిన చట్టవిరుద్ధ వలస దారులను 'కనిపెట్టి వారిని బహిష్కరించాలి'. ఏమైనా, రాష్ట్రంలో వరుసగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు తమ కర్తవ్యపాలనను విస్మరించాయి.

2005లో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు మరియు 'ఆసు'లు మరొక ఒప్పందం చేసుకున్నాయి. పౌరుల జాతీయ రిజిస్టర్‌ను సాధ్యమైనంత త్వరగా తాజాపరచాలని ఈ ఒప్పందం ఆదేశించింది. అయితే ఈ పనిని సగంలోనే అసంపూర్తిగా నిలిపివేశారు. ఒక ప్రభుత్వేతర సంస్థ సుప్రీమ్ కోర్టులో దాఖలుచేసిన ఓ పిటిషన్‌తో, అర్ధాంతరంగా ఆపివేసిన ఈ పనిని సత్వరమే పూర్తిచేయాలని సుప్రీంకోర్టు రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించింది.

పౌరుల జాతీయ రిజిస్టర్‌ను తాజాపరిచే పని ఇంకా అసంపూర్తిగా వుండగానే, కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం, ఈ సమస్యను ఓ ప్రమాదకరమైన మలుపు తిప్పేందుకు ముందుకొచ్చింది. 1955 చట్టాన్ని సవరిస్తూ 'పౌరసత్వం (సవరణ) బిల్లు'ను బిజెపి ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. ప్రతిపక్షాలు ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించాయి. 2016 ఆగస్టులో బిజెపి ప్రభుత్వం ఈ బిల్లును 'పార్లమెంట్ జాయింట్ సెలక్ట్ కమిటి'కి పంపవలసివచ్చింది.

2017 డిసెంబర్ 31 అర్ధరాత్రి సమయంలో తాజాపరిచిన జాతీయ పౌరుల రిజస్టరుయొక్క మొదటి ముసాయిదాను ప్రచురించారు. రాష్ట్రంలోని 3 కోట్ల 29 లక్షలమందిలో ఒక కోటీ 39 లక్షలమంది పేర్లను పరీక్షించవలసినవిగా, ఈ జాబితా తెలియజేస్తోంది. పరీక్షకు గురిచేయ బడాల్సిన పేర్లుగలవారు, జాబితాలో పేర్లు కనబడనివారు తమ పరిస్థితి గురించి తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తుది జాబితా బయటకొచ్చిన తరువాత కూడా సరిచేసు కోవడానికి అవకాశముంటుంది గనుక కంగారు పడవలసిన అవసరంలేదని రాష్ట్రప్రభుత్వం భరోసానిస్తోంది.

బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'పౌరసత్వం (సవరణ) బిల్లు–2016' ముస్లిములను మినహా యించి, అసోంలో మిగిలిన అల్ప సంఖ్యాక మతస్థులకు పౌరసత్వం కల్పిస్తోంది. బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్, పాకిస్తాన్‌ల నుండి వలసవచ్చిన హిందు, సిక్కు, బౌద్ధ, జైన, పార్శీ మరియు క్రిస్టియన్ మతస్థులను పౌరసత్వానికి అర్హులుగా ఈ బిల్లు పేర్కొంటోంది. మత ప్రాతిపదికన ప్రజలను వివక్షకు గురిచేసి, పౌరసత్వమిచ్చే ప్రక్రియనంతటినీ మతతత్వీకరించే చర్య ఇది. హిందూ దేశమనే సిద్ధాంతాన్ని వెనుకదోవగుండా చొప్పించే సంఘ్‌పరివార్ చర్య కూడా!

ఈ విధంగా అసోమ్‌లో పౌరసత్వమివ్వటం అనే అంశాన్ని సమస్యాత్మకంగాను, తుదిలేని కసరత్తుగానూ మార్చి వేశారు. ఈ కాలమంతటా, పాలకవర్గాలు, ప్రభుత్వాలు చొరబాటుదారులుగా పరిగణిస్తున్న కారణంగా అనేకమంది వేధింపు లకు, అసమానత్వానికి గురిచేయబడటంతో పాటు వారి హక్కులను నిరాకరించి, భూముల నుండి వారిని గెంటివేస్తున్నారు. అలాగే వలస ప్రజలయొక్క ఈ అభద్రతా స్థితిని ఉపయోగించుకుని ఎన్నికలలో ఓట్ల లబ్ధిని కూడా పొందుతున్నాయి.

పౌరసత్వానికి అర్హతలనుండి ముస్లిము వలసదారులను మినహాయించిన బిజెపియొక్క ఈ చర్య, వారిని మరింత విషాదకర స్థితిలోకి నెట్టివేస్తోంది. ప్రజాస్వామిక శక్తులు అన్ని రూపాల్లో ఈ విధానాన్ని వ్యతిరేకించి, పౌరసత్వం కోసం అసోం ముస్లిమ్ ప్రజల న్యాయమైన హక్కుకోసం నిలవాలి.

OOOO